సత్తా చాటిన సర్కారు స్కూలు విద్యార్థులు

గణపవరం మండలంలో 56 మందికి 500 పైబడి మార్కులు

పదో తరగతి ఫలితాల్లో గణపవరం నియోజకవర్గంలో విద్యార్థులు సత్తా చాటారు. అద్భుత ఫలితాలతో శభాష్ అనిపించారు. ముఖ్యంగా బాలికలు అత్యుత్తమ మార్కులు సాధించారు.

ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు హవా కనబరిచారు. ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించి స్ఫూర్తిగా నిలిచారు.


పిల్లా పూజిత, 573 గణపవరం


పోతల మౌనిక, 571 ,గణపవరం


పి.రామ్‌చరణ్, 571, గణపవరం


పి.భువనచంద్ర, 561 గణపవరం


కందుల దివ్య, 554. పత్తేపురం


నిమ్మల పావని, 553, పెదనింద్రకొలను

గణపవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో 500 మార్కులు తెచ్చుకోవడం అంటే అదోగొప్ప. అన్ని మార్కులు రావడం ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకే సొంతంగా ఉండేది. నిరంతర పర్యవేక్షణ, అదనపు తరగతులు, ప్రత్యేక మెటీరియల్, అన్నిరకాల వసతులతో కూడిన ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆస్థాయిలో మార్కులు సాధించేవారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అంతంత మాత్రంగానే మార్కులు వచ్చేవి. అయితే కొన్నేళ్లుగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సైతం ఆస్థాయిలో మార్కులు సాధిస్తూ, తమ సత్తా చూపుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఉత్తమ ఫలితాల సాధన సుసాధ్యమవుతుంది. ఐదేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాల రూపురేఖలు మార్చి, ప్రైవేటు పాఠశాలలకు మించిన వసతులు, సదుపాయాలను సమకూర్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం అధనపు తరగతులు, రెమిడియల్ తరగతులు, సెలవు రోజుల్లో అనుమానాల నివృత్తికి ప్రత్యేక తరగతుల నిర్వహణ, 100 రోజుల ప్రణాళిక, విద్యార్థులను విజయతీరాలకు చేర్చేలా ప్రత్యేక మెటీరియల్ సరఫరా చేయడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులను సొంతం చేసుకోగలిగారు. బుధవారం విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఎక్కువమంది 500పైబడిన మార్కులు సాధించారు. ఒక్క గణపవరం మండలంలోనే 56 మంది జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. అలాగే నిడమర్రు మండలంలో 10మందికి 500పైబడి మార్కులు రావడం విశేషం. గణపవరం బాలికోన్నత పాఠశాలలో 16 మంది విద్యార్థినులకు 500 పైగా మార్కులు వచ్చాయి. పిల్లా పూజిత అనే విద్యార్థిని 573 మార్కులతో మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. పోతల మౌనిక 571 మార్కులు సాధించింది. గణపవరం బాలురు ఉన్నత పాఠశాలలో 7గురు విద్యార్థులు 500పైగా మార్కులు సాధించగా రామ్‌చరణ్‌అనే విద్యార్థి అత్యధికంగా 571 మార్కులు సాధించాడు. పిప్పర ఉన్నత పాఠశాల నుంచి 15 మంది, డి.కుముదవల్లి ఉన్నత పాఠశాల నుంచి 12 మంది అర్ధవరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఒకరు, కేశవరం ఉన్నత పాఠశాల నుంచి 4గురు, కాశిపాడు ఉన్నత పాఠశాలనుంచి ఒకరు మొత్తం 56 మంది విద్యార్థులు 500 పైబడిన మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. వీరిలో 50శాతం మంది విద్యార్థులు 550 పైబడిన మార్కులు సాధించడం మరో విశేషం. నిడమర్రు మండలంలోని 7 జెడ్పీ ఉన్నత పాఠశాలలనుంచి 10మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. చిననింద్రకొలను జెడ్పీ ఉన్నత పాఠశాలనుంచి 4 గురు విద్యార్థులు 500పైగా మార్కులు సాధించగా వీరిలోకందుల దివ్య అనే విద్యార్థిని 554 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. చానమిల్లి ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు, అడవికొలను ఉన్నత పాఠశాలనుంచి ఇద్దరు, పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలనుంచి ఇద్దరు 500పైగా మార్కులు సాధించారు.

ప్రత్యేక తరగతులతో మంచి ఫలితాలు



పదోతరగతి విద్యార్థులకు గతంలో కన్నా భిన్నంగా ప్రత్యేక బోధనా కార్యక్రమాలు నిర్వహించడం మంచి ఫలితాలను ఇచ్చింది. దసరా, సంక్రాంతి సెలవు రోజులలో ప్రత్యేక తరగతులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ఏ గ్రేడు విద్యార్థులకు మరింత మెరుగైన బోధన అందించాం. 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు మంచి ఫలితాన్నిచ్చింది.

గొర్రెల బాలయ్య, ఎంఈవో

సమష్టి కృషితోనే మంచి ఫలితాలు



ఉపాధ్యాయుల సమష్టి కృషి, జిల్లా విద్యాశాఖ అందజేసిన ప్రణాళిక ప్రకారం బోధనతో మంచి ఫలితాలు వచ్చాయి. ఇంతకు ముందు లేనివిధంగా ఈఏడాది ఏకంగా 16 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించడమే కాక, తమ పాఠశాల విద్యార్థిని పిల్ల పూజిత 573 మార్కులతో గణపవరం, నిడమర్రు మండలాలలోనే ప్రథమ స్థానంలో నిలవడం మాకు గర్వకారణం. ప్రతి రోజూ క్రమం తప్పకుండా ఉదయం, సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక తరగతుల వల్లనే ఈఫలితాలు వచ్చాయి.

బాలభాస్కరరావు, హెచ్ఎం, బాలికోన్నత పాఠశాల, గణపవరం

క్లుప్తంగా

సువార్త ప్రకటన విస్తృతం కావాలి



సువార్త సభల్లో మాట్లాడుతున్న సువార్తీకులు

దెందులూరు: సువార్త ప్రకటన విస్తృతం కావాలని సిస్టర్ గ్రేస్ రాణి అన్నారు. దెందులూరు యందం వారివీధిలో మూడో రోజు రక్షణ సువార్త సభలు జరిగాయి. దేవుని ఆజ్ఞలు అనుసరించేలా ప్రజలందరినీ సమయత్వం చేసేందుకు రక్షణ పొందేందుకు జీవన విధానాన్ని మెరుగుపరిచే కోరడం చాలా ముఖ్యమని సిస్టర్ గ్రేస్ ర్యాలీ తెలిపారు. అనంతరం పోతునూరు పాస్టర్లు ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి : మండలంలోని పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ కవ్వగుంట సబ్ స్టేషన్ పరిధిలో ఎస్ఎస్‌హెడ్ క్వార్టర్ ఫీడర్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. కవ్వగుంట, గార్లమడుగు పరిసర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. పెదవేగి, లక్ష్మీపురం, సీతాపురం పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రీ సర్వేను త్వరగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: రీ సర్వేతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని దెందులూరు తహసీల్దార్ సుమతి తెలిపారు. గురువారం మండలం రీసర్వేపై విఆర్వోలు, వీఆర్ఏలు, మండల సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుమతి మాట్లాడుతూ రీ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాము సేవలు మరువలేనివి


రాము చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

దెందులూరు: ఉపాధ్యాయ వృత్తికి దివంగత ప్రధానోపాధ్యాయులు పూర్ణశెట్టి రాము వన్నె తీసుకువచ్చారని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు బీవీ రమణమూర్తి, జరజాపు రంగారావు అన్నారు. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో రాము సంస్మరణ సభ జరిగింది. ప్రజాప్రతినిధిగా హెచ్ఎంగా చెరగని ముద్ర వేశారన్నారు. ఆధ్యాత్మిక రంగానికి కూడా దశాబ్దాలు సేవలందించి తిరుగులేని మహోన్నత వ్యక్తిగా ఈ ప్రాంత ప్రజల మనసుల్లో ముద్ర వేసుకున్నారని లయన్స్ క్లబ్ జిల్లా డైరెక్టర్, మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


బాధితులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందచేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: వేసవిలో ప్రతి ఒక్కరు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని పోతునూరు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం పోతునూరు వైద్యశాలలో వడ దెబ్బ బాధితులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను వైద్య సిబ్బంది అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన సూచనలు ఆహారం, విశ్రాంతిపై వివరించారు.

విద్యార్థులకు అభినందనలు

ఉంగుటూరు: మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఉన్న శ్రీ సూర్య (ఇంగ్లీష్ మీడియం) స్కూల్లో పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల మొదటి, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన లాస్య జాహ్నవి (586), జి.పూజిత లక్ష్మీదుర్గా (584), ఎం.నాయన సాయి (578)లతో పాటు ఉత్తీర్ణత సాధించిన పలువురు విద్యార్థులకు ఎమ్మెల్యే ధర్మరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో వేములపాటి సుధీర్, స్కూల్ యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

స్టార్ హోటల్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: మండలంలోని టూరిజం శాఖ ఆదేశాల మేరకు కొత్తగూడెంలో స్టార్ హోటల్ ఏర్పాటుకు స్థల పరిశీలన గురువారం దెందులూరు తహసీల్దార్ బి.సుమతి చేశారు. జాతీయ రహదారి ప్రక్కన కొత్తగూడెం ప్రాంతం అనుకూలంగా ఉండటంతో అక్కడి స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రమణారావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్‌ఓ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి చర్యలు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తానని పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) తెలిపారు. తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు నియోజకవర్గంలో పార్టీ పటిష్టానికి చేపడుతున్న చర్యలు, నూతన కమిటీల నియామకాలు, ఇతర అంశాలపై జగన్‌మోహన్ రెడ్డితో చర్చించామని జేపీ వివరించారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా పనిచేస్తామని తెలిపారు.

ఉగ్రదాడి హేయమైన చర్య


భీమడోలు సంతమార్కెట్ వద్ద మానవహారం చేస్తున్న దృశ్యం


నిడమర్రులో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నేతలు

భీమడోలు: ఉగ్రదాడిని ఖండిస్తూ గురువారం రాత్రి భీమడోలులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో గణపతి సెంటర్ నుంచి భీమడోలు సంతమార్కెట్ వరకు కొవ్వొత్తులు పట్టుకొని నిరసన ర్యాలీ చేశారు. ఉగ్రవాదం నశించాలని కోరుతూ నినదించారు. ప్లేకార్డులను పట్టుకుని ప్రదర్శన చేశారు. సంతమార్కెట్ వద్ద మానవహారం చేశారు. మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రులో కొవ్వొత్తుల ర్యాలీ

నిడమర్రు: జమ్మూ కాశ్మీర్లో బైసనన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి చేసి 28 మందిని హతమార్చడాన్ని ఖండిస్తూ గురువారం రాత్రి నిడమర్రు మండలం వాసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని మృతుల కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు దేశ పౌరులంతా ఏకతాటిపైకి వచ్చి సంఘీభావం తెలిపాలన్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదం పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలు పార్టీలకు చెందిన నేతలు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


భీమడోలులో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: ప్రతి ఏటా వేసవిలో బాటచారులు, భక్తుల దాహార్తిని తీర్చుతున్న వైఎస్సార్ సీపీ వీరాభిమాని రేవాడ శ్రీనివాసరావు సేవలు ఆదర్శప్రాయమని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు రాష్ట్రీయ రహదారిపై గురువారం వైఎస్సార్ సీపీ వీరాభిమాని రేవాడ శ్రీనివాసరావు దివంగత సీఎం వైఎస్సార్ పేరుతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ప్రతి వేసవిలో ప్రజలందరి దాహార్తిని తీర్చేందుకు రేవాడ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పేదరికాన్ని అనుభవిస్తూ కష్టించి సంపాదించుకున్న మొత్తాన్ని సామాజిక సేవలకు వినియోగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ ఆల్తి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు పసుపులేటి సత్యనారాయణ, రామిశెట్టి శ్రీను, సొసైటీ మాజీ డైరెక్టర్ కిలపర్తి భాస్కరరావు, పోలసానిపల్లి మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్రప్రసాద్, నాయకులు మంగి గోవిందరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాసుబాబు పరామర్శ


అరుంధతీ కాలనీలో వైఎస్సార్ సీపీ అభిమానిని పరామర్శిస్తున్న వాసుబాబు

భీమడోలు: వైఎస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని అరుంధతీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కేతా సాయి తండ్రి ఇటీవల తన ఇంటిపై నుంచి జారి పడ్డాడు. దీనితో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేర్చి వైద్య సేవలందించారు. ప్రస్తుతం ఇంటి వద్దనే ఆతను వైద్య సేవలను పొందుతున్నాడు. ఆతన్ని వాసుబాబు గురువారం పరామర్శించి ధైర్యాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ ఆల్తి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు పసుపులేటి సత్యనారాయణ, రామిశెట్టి శ్రీను, సొసైటీ మాజీ డైరెక్టర్ కిలపర్తి భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి


దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గణపవరం: దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్లు మంజూరుకు కృషి చేస్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పర భవిత కేంద్రంలో ఆయన దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. పిప్పర 5వ వార్డు పాఠశాల చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛను రూ.6వేలు ఇస్తామన్న హామీ మేరకు పింఛను సొమ్మును పెంచామన్నారు. ఈ సందర్భంగా ముగ్గురికి వీల్ చైర్‌లు, ఒకరికి ట్రైసైకిల్, ఒక సీపీచైర్, ఒకరికి వాకర్, ఇద్దరికి వినికిడి యంత్రాలు ఎంఎల్‌ఏ చేతులమీదుగా అందచేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో బేబీ శ్రీలక్ష్మి, ఎంఈవోలు -1, 2 ఎస్.రాజేష్, గొర్రెల బాలయ్య, మండల తెదేపా అధ్యక్షుడు, ఇందుకూరి రామకృష్ణంరాజు, మండల జనసేన అధ్యక్షుడు తోట శ్రీను, ఉంగుటూరు ఎఎంసి అధ్యక్షుడు సూరత్తుల అయ్యప్ప, కూటమి నాయకులు కూనసాని నాగేశ్వరరావు, కొయ్య వెంకటసుబ్బారావు, నీటిసంఘం అధ్యక్షుడు దాట్ల రంగరాజు, హెచ్ఎం టి. శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు: మండలంలోని భవిత కేంద్రం వద్ద గురువారం దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లు, ప్రత్యేక అవసరమైన ఉపకరణాలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నేతలు పాల్గున్నారు.

మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం


మొక్కలు నాటుతున్న ఫాదర్ మోజెస్

పెదవేగి: మొక్కలు మానవ మనుగడకు జీవనాధారం అని సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలోని సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో అంతర్జాతీయ మ్యాక్స్‌లో ఫేసియల్ రేడియాలజీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఎం శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ మోజెస్ ఆధ్వర్యంలో ఆయా విభాగాల్లో కళాశాలల్లోని ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మృదుల, డాక్టర్ స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి కుర్చీల వితరణ


హెల్త్ సెంటర్‌కు కుర్చీలను అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఏలూరు (టూటౌన్) : రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక చాణిక్యపురి ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు రూ.6000 వేలు విలువైన 10 కుర్చీలను డాక్టర్ ఎస్ మానసకు అందజేశారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల రిటైర్డ్ తెలుగు శాఖాధ్యక్షురాలు షేక్ రహిమాన్ జ్ఞాపకార్థం ఆమె భర్త, యూనిట్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ ఆర్థిక సాయంతో ఈ సాయం అందించారు. కోటదిబ్బలోని సబ్ ట్రెజరీ ఆఫీసుకు రూ.5500 విలువైన 10 కుర్చీలను అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ జి.సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు జి.లలిత, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎన్‌వీవీఎస్ ప్రసాద్, కె.శ్రీకాంత్, సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఎం స్వరాజ్య మణి, ట్రెజరీ సిబ్బంది, శాణిక్యపురి కాలనీ అసోసియేషన్ సభ్యులు పి.రాజారావు, వి.సుబ్రహ్మణ్యం, ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్): టీడీపీ కూటమి ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అశోక్ నగర్‌లోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా అధ్యక్షుడు యర్రా రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రమణారావు మాట్లాడారు. కార్మికులు సంక్షేమ పథకాలు అమలుకు ఆటంకంగా ఉన్న 14 12 మెమో రద్దుచేసి, సంక్షేమ బోర్డు పథకాల అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు సంక్షేమ బోర్డులో నిధులు కార్మికులు కుటుంబాలకు మాత్రమే ఖర్చు చేయాలని, పెండింగ్ క్లైములను పరిష్కరించాలని కోరారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. తొలుత భవన నిర్మాణ కార్మికులు ప్రదర్శన చేశారు. ధర్నాలో అయినపర్తి మాధవ, సీహెచ్ కొండలరావు, షేక్ అబ్దుల్, అక్బర్, చీర అప్పారావు, పరస రాజేష్, కానా, సాంబశివరావు, బత్తుల బుజ్జి, తాడి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

ఎంఆర్‌పీఎస్ సేవలు అభినందనీయం


బాధితురాలుకి సాయం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

దెందులూరు: మండలంలో ఎంఆర్‌పీఎస్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియడారు. మండలంలో వివిధ రకాల అనారోగ్య పరిస్థితులు వల్ల బాధితులుగా ఉన్న వారిని ఎంఆర్‌పీఎస్ చేయూత ఇస్తుందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగల శేఖర్ అన్నారు. గురువారం మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో మంచంపై ఉన్న పలువురు బాధితులకు పండ్లు, ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సొంగా సోమయ్య తదితరులు ఉన్నారు.

వికలాంగుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

ఏలూరు (టూటౌన్): జిల్లా పరిషత్ / మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విభిన్న ప్రతిభావంతుల (వికలాంగుల) పిల్లలకు విద్యా ప్రతిభా పురస్కారం -2025 అందజేయనున్నట్టు విసాస్ ఏపీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అల్లాడి నటరాజు తెలిపారు. శారీరకం, అంధత్వం, చెవిటి – మూగ తదితర వైకల్యాలు గల వ్యక్తుల్లో 10వ తరగతి (2025)లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో ప్రథమ శ్రేణిలో పాసైన విసాస్ ఏపీకి దరఖాస్తు చేసుకున్న అత్యధిక మార్కులు సాధించిన వారికి రూ.5000, రూ.3000, రూ.2000 నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందజేస్తామని చెప్పారు.

